PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శనివారం 17-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :137 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

# సీఎం రేవంత్‌రెడ్డితో

## హ్యుందాయ్ కంపెనీ ప్రతినిధుల భేటీ

- జహీరాబాద్‌లో హ్యుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రం.
- పెట్టుబడి రూ.8,528 కోట్లు.
- 4,275 ఉద్యోగాల కల్పన.
- అనుమతులు వేగంగా ఇవ్వాలని సీఎం ఆదేశం.
- కార్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఆహ్వానం.



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో బృందం భేటీ అయ్యింది. రూ.8,528 కోట్లతో జహీరాబాద్‌లో హ్యుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మించనున్నట్లు తెలిపింది. దీనివల్ల 4,275 ఉద్యోగాలు వస్తాయని సీఎంకు కంపెనీ ప్రతినిధులు వివరించారు. హ్యుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రానికి అనుమతులు వేగంగా ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో కార్ల తయారీ కేంద్రం కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్‌ను ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉందని సీఎం వివరించారు.

## వీలైనంత త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

ఒప్పందానికి సంబంధించిన తొలి దశ ఖరారైందని ప్రస్తుతం దీనికి చట్టపరమైన ముసాయిదా రూపకల్పన జరుగుతోందని భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల తనకు చెప్పినట్లు సీతారామన్ వెల్లడించారు.




2లో

## బంగ్లాదేశ్ లాంటి 'పాలన మార్పు' కావాలట..

### విపక్షాలకు రాజ్‌నాథ్ కౌంటర్



2లో

- విపక్షాల రంగు బయటపడుతోంది...
అధికారం కోసమే నిరసనలు: భాజపా

- ప్రధాని పదవి కావాలంటే..: కంగన

దేశంలో గందరగోళం సృష్టించడానికి ప్రజాస్వామ్యం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యువ శక్తిని వాడుకుని విపక్షాలు అరాచకాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బంగ్లాదేశ్ లాంటి పాలన మార్పు కావాలని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కోరుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన మీడియా సమావేశంలో విపక్షాల ఆందోళనలపై రాజ్‌నాథ్ స్పందించారు."రాజకీయాల కోసం కాంగ్రెస్, దాని మిత్ర పార్టీలు ఈ దేశ యువతను పావులుగా వాడుకుంటున్నాయి. దేశాభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించేలా యువతకు దిశానిర్దేశం చేయడానికి బదులు..

## అన్ని శాఖల సమన్వయంతో గరుడసేవను విజయవంతం చేస్తాం: తితిదే ఈవో



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ రాత్రి జరిగే గరుడవాహన సేవకు భారీ ఏర్పాట్లు చేశామని తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర తెలిపారు. లక్షల సంఖ్యలో తరలి వచ్చే భక్తుల కోసం అన్న పానీయాలు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ.. స్వామివారి గరుడ వాహన సేవను విజయవంతం చేస్తామన్నారు.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు



మిగతాది 2లో

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు: కిషన్‌రెడ్డి

"2029 వరకు ప్రధానిగా మోదీ ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు.



రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు, కేంద్రాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు: కేటీఆర్



» రాష్ట్రంలో నెలకొన్న నీటి ఎద్దడికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

» "ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను దిగువకు విడుదల చేశారు.

» కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించి గోదావరిపై ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు.

# సంపాదకీయం

## మోదీపై బద్ధ వ్యతిరేకత ఇంకా రాలేదు!

తరువాత ఏమిటి? నిరసనల వెల్లువలో ఉన్న మనం ఇకపై ఏం చేయాలి? బెంగాలీ మార్కెట్‌లో కూర్చుని, ఏమంత రుచిగా లేని కాఫీ తాగుతూ నాలో నేను నిశితంగా, లోతుగా తర్కించుకున్నాను. ఈ ప్రశ్న అడిగేందుకు ఇది సందర్భోచిత సమయం కూడా. అక్టోబర్ 12న డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా వర్ధంతి. ఆయన చెప్పిన ఒక సత్యాన్ని మనం విస్మరించకూడదు. అదేమిటంటే 'ఒక సజీవ ప్రజా సమూహం ఐదు సంవత్సరాలు వేచి ఉండదు' అని. పోలీసులు గత పదిరోజులలో ఐదుసార్లు నన్ను నిర్బంధించారు-- పట్టుకున్నారు, లాక్కెళ్లారు, నెట్టివేశారు, పోలీస్‌వ్యాన్‌లోకి విసిరివేశారు. ఎందుకు? భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపినందుకు!

సుప్రీంకోర్టు దాకా సాగిన నిరసన ప్రదర్శనలో పాల్గొని మేము వెనక్కు వచ్చి బెంగాలీ మార్కెట్‌లో కూర్చుని కాఫీ సేవనంలో సేదతీరిన సందర్భమది. న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కాదు అది. న్యాయస్థానాలపై ఒత్తిడి చేసే ప్రయత్నం కూడా ఎంతమాత్రం కాదది. గత వారాంతంలో ఢిల్లీ వీధులలో అభాసుపాలైన సుప్రీంకోర్టు గౌరవాన్ని ఉద్ధరించేందుకు జరిగిన ప్రయత్నమే ఆ నిరసన ప్రదర్శన. అడుగడుగునా కర్ఫ్యూ అమల్లో ఉన్న జాతీయ రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ఈ దేశ పౌరులుగా మాకు హక్కు ఉన్నదనే సత్యాన్ని చాటి చెప్పేందుకు నిర్వహించిన నిరసన అది. ఎటువంటి క్షణమది? ఒక భీతావహ పరిస్థితిని మేము చవి చూశాము.

సరే, తదుపరి చర్య ఎలా ఉండాలి? సీఈసీ వ్యతిరేక ఉద్యమం విస్తరించాల్సి ఉన్నది-- భౌగోళికంగా, సామాజికంగా. ఆసేతుహిమాచలం అన్ని ప్రాంతాలకు ఈ ఉద్యమాగ్ని వ్యాపించాలి. సమస్త సామాజిక శ్రేణులూ ఈ ఉద్యమంలో పాలుపంచుకోవాలి. వీధులలో రోజూ యథావిధిగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ కొన్ని కొత్త కార్యాచరణ పద్ధతులను రూపొందించుకోవాలి. వ్యవస్థాగతంగా ఒత్తిళ్లు తీసుకువచ్చేందుకు తోడ్పడే అంశాలను గుర్తించాలి. ఉపయోగించుకోవాలి. నిరసన వ్యూహమూ, ఎత్తుగడలు రూపొందించుకుంటూ గమ్యమూ, దాన్ని చేరే మార్గాన్ని అర్థం చేసుకోవడం లక్ష్య సాధనకు విశేషంగా తోడ్పడగలదు.

రాజనీతి శాస్త్రవేత్త సుహాస్ పల్షికర్ ప్రస్తుత నిరసనలను 'పునర్ ప్రజాస్వామ్యీకరణ'గా అభివర్ణించారు. నిర్వీర్యమైన పలు రాజ్యాంగ వ్యవస్థలను పునరుద్ధరించేందుకు అదొక మార్గమని ఆయన పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన (నేను తరచూ పేర్కొనే) 'ప్రజాస్వామ్యాన్ని స్వాధీనం చేసుకోవడం' అనే దుష్ట ప్రక్రియ పర్యవసానాలే మన రాజ్యాంగ వ్యవస్థల వైఫల్యాలు. చిత్రమేమిటంటే 'ప్రజాస్వామ్యాన్ని స్వాధీనం చేసుకోవడం' అనేది పూర్తిగా ప్రజాస్వామిక పద్ధతులలోనే జరిగింది. ఇందుకొక కీలక ఉపకరణం 'ఎన్నికలపై గుత్తాధిపత్యాన్ని సాధించడం'. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి కొత్త నిబంధనలతో ఎన్నికల సంఘం తమకు అనుకూలంగా వ్యవహరించేలా చేసుకోవడం సంభవించింది. సరే, దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీని దుర్వినియోగపరచడం ఉండనే ఉంది. తుదకు ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), నియోజకవర్గాల పునర్విభజన, ఒక దేశం--ఒకే ఎన్నిక మొదలైన వాటితో ఎన్నికల వ్యవస్థను ఎటువంటి మినహాయింపు లేకుండా స్వాయత్తం చేసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భారతీయ జనతా పార్టీకి శాశ్వత మెజారిటీ లభించేలా చేసేందుకే ఇవన్నీ జరుగుతున్నాయి. ఇదిగో ఈ దుర్మార్గ, రాజ్యాంగ విరుద్ధ పన్నాగాలకు వ్యతిరేకంగానే ప్రస్తుత నిరసనలు ప్రజ్వరిల్లాయి.

ఎన్నికల సమగ్రత పునరుద్ధరణకే ఈ నిరసనలు. ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధంగా అమలు కావాలన్నదే వాటి ఏకైక లక్ష్యం. నిరసనకారులకు ఉమ్మడిగా ఒక అధికారిక ప్రణాళిక లేకపోయినప్పటికీ మూడు డిమాండ్ల విషయంలో వారి మధ్య పూర్తి ఏకీభావం ఉన్నది. వాటిలో మొదటిది-- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా లేదా అభిశంసన. భారత ఎన్నికల సంఘం పనితీరు రాజ్యాంగబద్ధంగా ఉండేలా చేసి, దాని విశ్వసనీయతను పునరుద్ధరించే దిశగా ఇదొక ప్రతీకాత్మక చర్య. రెండవది-- 'సర్' ఉపసంహరణ. తద్వారా, ప్రజాస్వామ్య చరిత్రలో అతిపెద్ద ఓట్ల తొలగింపును నిరర్థకం చేయడం. మూడవది-- ఎన్నికల సంఘం కమిషనర్లుగా ఎవరినైనా నియమించేందుకు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి నిర్నిబంధ అధికారాలను ఇచ్చిన 'ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీ కాలం) చట్టం--2023' రద్దు.

ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా జరగాలన్న ఆకాంక్షే ఈ డిమాండ్లకు ప్రాథమిక ప్రేరణ. కనీసం, 2014లో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చిన ఎన్నికల మాదిరిగా భారత పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, న్యాయవిహితంగా జరగాలని 'సర్' వ్యతిరేక ఆందోళనకారులు ఆశిస్తున్నారు. అంతకు తక్కువగా ఏదీ వారికి ఆమోదయోగ్యం కాదు, కాబోదు.

ఈ నిరసనలు ఎన్నికల సమగ్రత పునరుద్ధరణకే గానీ 'పాలన మార్పు' (రెజిమ్ ఛేంజ్) కోసం కాదనే వాస్తవాన్ని గుర్తించాలి. నిరసనల వెనుక ఉన్న వివిధ శక్తులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెన్వెంటనే దిగిపోవాలని కోరుకుంటూ ఉండవచ్చుగానీ సామాన్య పౌరులను అసంఖ్యాకంగా వీధులలోకి తీసుకువచ్చింది మోదీ పట్ల బద్ధ వ్యతిరేకత కానేకాదు. ఇంతవరకు అటువంటి వ్యతిరేక భావం ప్రజల్లో లేదు. ప్రజాస్వామికంగా, శాంతియుతంగా అధికార బదిలీకి వెసులుబాటు నిచ్చే న్యాయబద్ధమైన వ్యవస్థ పునరుద్ధరణ లక్ష్యమే సామాన్యులను ఆందోళనా పథంలోకి నడిపిస్తోంది. ఇప్పటికైతే ఇదే సత్యం. వారి లక్ష్యం ప్రజాస్వామికమైనది. అది నెరవేరి తీరాలి. అది నెరవేరేందుకు దోహదం చేసే మార్గాలు అన్నీ మూసుకుపోతే జరిగేదేమిటి? ప్రస్తుత ఆందోళనలు పాలన మార్పునకై ప్రజా తిరుగుబాటుగా పరిణమిస్తాయి. అదే సంభవిస్తే పౌరులు, వ్యవస్థలు భారీ మూల్యం చెల్లించవలసిరావడం అనివార్యమవుతుంది. ఇటువంటి స్థితిని ఊహించడమే భీతావహం గొల్పుతోంది.

నిరసనలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రజాస్వామిక శక్తుల, మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ ఆందోళనలలో పాల్గొంటున్న శక్తుల పునర్వ్యవస్థీకరణ ఎంతైనా అవసరం. ఇప్పటివరకు ఈ నిరసనలు 'స్వతస్సిద్ధ సమన్వయం'కు ఒక ప్రామాణిక ఉదాహరణగా ఉన్నాయి. ఒక ప్రధాన వ్యక్తి లేదా సంస్థ ఆదేశం లేదా కీలక సమన్వయం లేకుండానే క్రమబద్ధమైన సామూహిక కార్యాచరణగా ఈ నిరసనలు అయత్నకృతంగా రూపుదాల్చాయి. నిరసనలలో పాలుపంచుకుంటున్న భిన్న శక్తులు పరస్పరం ప్రతిస్పందించుకుంటున్నప్పుడు వారి కార్యాచరణలు ఎటువంటి ఉద్దేశపూర్వక ప్రణాళిక లేకుండానే ఏకీకృతమవుతాయి. 'బాధ్యతాయుత పౌరులు' (ఈ వ్యాసకర్త కూడా వీరిలో ఒకరు) ఇచ్చిన పిలుపూ ఆందోళనా శక్తుల స్వతస్సిద్ధ సమన్వయానికి దారితీసింది. మా పిలుపుతో అక్టోబర్ 2 నుంచి 4 వరకు ప్రజలు వీధులలోకి వచ్చి ఉవ్వెత్తున నిరసన తెలిపారు. అక్టోబర్ 10న జరిగిన ఆందోళనలకు సీజేపీ పిలుపునిచ్చింది. ఇండియా కూటమి భాగస్వామ్యపక్షాలు అక్టోబర్ 6 నుంచి 12 దాకా ప్రతిరోజూ ఆందోళనలు నిర్వహించాయి. ఇవేవీ సమన్వయ నిర్ణయాలతో జరిగినవి కావు. అయితే వాటన్నిటి ఉమ్మడి ఫలితం ఒక వాద్య సమ్మేళనం ప్రభావాన్ని లేదా ఒక రిలే రేస్‌ను తలపించాయి. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను ఒక విలక్షణ సామూహిక స్ఫూర్తితో నిర్వహించారు. నిరసనకారుల డిమాండ్లను కించిత్ కూడా అంగీకరించకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుంటే ఆందోళనకారులు తమ ప్రయత్నాలను మరింతగా సమన్వయం చేసుకునే మార్గాన్ని కనుగొనాలి. సీజేపీ, ఇండియా కూటమి, విద్యార్థి, యువజన సంఘాలు, పౌర సమాజ సంస్థలు ఒకే ఛత్రం కిందకు రాకపోవచ్చు, రావాల్సిన అవసరం కూడా లేదు. అయితే అవి పరస్పర విరుద్ధ లక్ష్యాలతో పనిచేయకుండా ఉండాలి. తమ శక్తి సామర్థ్యాలను ఎట్టి పరిస్థితులలోను ఒకరు మరొకరికి వ్యతిరేకంగా ఉపయోగించకూడదు. ఈ విషయంలో అందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఉంటారని నమ్మేందుకు ఆస్కారం నిండుగా ఉన్నది. ఇందుకు కారకుడు రాహుల్‌గాంధీ. ఆందోళనలు వేర్వేరుగా లేదా సమాంతరంగా జరగవని, అన్నీ ఒకే ఆందోళనగా జరుగుతాయని ఆయన స్పష్టంగా చెప్పారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఈ ఉద్యమంలో పాలుపంచుకుంటున్న విభిన్నశక్తులు అన్నిటిలోనూ ఈసారి ఒక మౌలిక మార్పు చోటుచేసుకున్నది. ఇది ఆ శక్తుల పునర్వ్యవస్థీకరణను సుసాధ్యం చేయగలుగుతుంది. ఈ పునర్వ్యవస్థీకరణ సుసాధ్యమవడం పైనే ఈ ఉద్యమ విజయం ఆధారపడి ఉన్నది. తమకు తాముగా సుసంఘటితమైన నిరసనకారుల (గత జూలైలో నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఉద్యమించినవారు) శక్తి సామర్థ్యాలు ప్రస్తుత ఉద్యమ సాఫల్యతకు చాలా కీలకం. ఈ యువ నిరసనకారులు ఏ సంస్థకూ నిబద్ధమైనవారు కారు. ప్రస్తుత ఉద్యమ నిర్వహణలో పరస్పర విరుద్ధ సంకేతాలు కనిపిస్తే

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు

మొదటిపేజీ తరువాయి

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున చీర, సారె సమర్పించారు. ఇంద్రకీలాద్రి చేరుకున్న చంద్రబాబు దంపతులకు దేవాదాయశాఖ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మ దర్శనం అనంతరం పండితులు సీఎం దంపతులకు వేదాశీర్వచనం చేశారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు, కేంద్రాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించేలా రాహుల్‌గాంధీ వ్యవహరిస్తున్నారని అన్నారు.“ 2029 వరకు ప్రధానిగా మోదీ ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. బంగ్లాదేశ్, శ్రీలంకలో చేసినట్లు ప్రభుత్వాన్ని కూల్చుతామని దింపుడుకల్లం ఆశలు పెట్టుకున్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉంటే.. భారత్ మాత్రం అభివృద్ధి చెందుతోంది. రాహుల్ గాంధీ తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు” అని కిషన్‌రెడ్డి అన్నారు.

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న నీటి ఎద్దడికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈమేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరవు అని కేటీఆర్ ఆరోపించారు.“ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను దిగువకు విడుదల చేశారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించి గోదావరిపై ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. మరోవైపు పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా కృష్ణా జలాలను వృథా చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తగ్గే అవకాశం ఉందని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదు” అని కేటీఆర్ విమర్శించారు.

## విజయవాడ- విశాఖ మధ్య ప్రత్యేక రైళ్లు



విశాఖపట్నం: దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ-విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళు నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ నెల 17న (శనివారం) విశాఖ-విజయవాడ మధ్య, 19న (సోమవారం) విజయవాడ-విశాఖ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు వెల్లడించింది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్లలో ఆగనున్నాయి. మరోవైపు ఈ నెల 17, 18 తేదీల్లో విజయవాడ-పలాస.. 18, 19 తేదీల్లో పలాస-విజయవాడ మధ్య జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

## ఏపీలో పలు చోట్ల ఉద్రిక్తతలు.. కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విజయవాడ: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు చోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల ఫిర్యాదులు, సమస్యలపై స్పందించనుంది. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లు: 0866 2490023, 2490024, 2490025, 2490026 ఫోన్ చేయాలని ఎస్ఈసీ వెల్లడించింది.

అన్నమయ్య జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. జిల్లాలోని పుంగనూరు, రాయచోటిలో వైకాపా, తెదేపా వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగాయి. ఈ క్రమంలో జరిగిన రాళ్లదాడిలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీలో వాహనాలకు నిప్పంటించారు. తిరుపతిలోనూ వైకాపా నేతలు హల్‌చల్ చేశారు. ఆ పార్టీ నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు తెదేపా కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

## ఆత్మకూరు బైపాస్ రోడ్డుకు వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం చేశాం: పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి

నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు బైపాస్ రోడ్డుకు వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం చేశామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆత్మకూరులో నూతన బైపాస్ రోడ్డును వర్చువల్‌గా పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. రూ.8.91 లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు లైన్ల రహదారితో పట్టణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఈ బైపాస్ రోడ్డు అభివృద్ధి చెందిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ముంబై జాతీయ రహదారి నుంచి ఆత్మకూరు పట్టణానికి బైపాస్ రోడ్డును అనుసంధానం చేస్తున్నామని వివరించారు. రెండున్నర కిలోమీటర్ల మేర బైపాస్ రహదారిని నిర్మిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.నెల్లూరు నగరాన్ని అత్యంత సుందరంగా మారుస్తాం: కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నెల్లూరు నగరాన్ని అత్యంత సుందరంగా మార్చాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వ్యాఖ్యానించారు. మినీబైపాస్ రోడ్డులో ఐకానిక్ జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడారు. నుడా ఆధ్వర్యంలో 105 అడుగుల ఎత్తుండే అతిపొడవైన స్థంభంపై జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే తమ లక్ష్యమని కోటంరెడ్డి చెప్పారు. స్వాతంత్ర సమరయోధులు, దండి పోరాట యాత్రల చిత్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నెల్లూరుకు మహానగరాల నుంచి యాత్రికులు వచ్చేంతగా సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 'ఐ లవ్ నెల్లూరు'.. అనే నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

## వీలైనంత త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం: నిర్మలా సీతారామన్

మొదటిపేజీ తరువాయి

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. ఇరు పక్షాల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా.. కొలి కీలక వ్యాఖ్యలు చేశారు. వీలైనంత త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ వాణిజ్యం సహా ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని.. ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. అగ్రరాజ్యంతో చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. బ్యాంకాక్‌లో నిర్వహించిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల్లో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.ఒప్పందానికి సంబంధించిన తొలి దశ ఖరారైందని ప్రస్తుతం దీనికి చట్టపరమైన ముసాయిదా రూపకల్పన జరుగుతోందని భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల తనకు చెప్పినట్లు సీతారామన్ వెల్లడించారు. దానిపై త్వరలో సంతకాలు కూడా చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచంలో పలు అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. భారత్ బలమైన వృద్ధి కొనసాగిస్తోందన్నారు. 'అన్ని ప్రతికూలతలను ఎదుర్కొని భారతదేశం వృద్ధిని కొనసాగించగలుగుతోంది. నిజానికి.. కొవిడ్ తర్వాత గత నాలుగైదేళ్లలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన దేశం మనదే. సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, ఆర్థిక క్రమశిక్షణే ఈ పనితీరుకు కారణం. ప్రజాధనం విషయంలో మాకు బాధ్యత ఉంది' అని సీతారామన్ పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్ లాంటి 'పాలన మార్పు' కావాలట.. విపక్షాలకు రాజ్‌నాథ్ కౌంటర్

మొదటిపేజీ తరువాయి

దేశంలో గందరగోళం సృష్టించడానికి ప్రజాస్వామ్యం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యువ శక్తిని వాడుకుని విపక్షాలు అరాచకాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బంగ్లాదేశ్ లాంటి పాలన మార్పు కావాలని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కోరుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన మీడియా సమావేశంలో విపక్షాల ఆందోళనలపై రాజ్‌నాథ్ స్పందించారు. “రాజకీయాల కోసం కాంగ్రెస్, దాని మిత్ర పార్టీలు ఈ దేశ యువతను పావులుగా వాడుకుంటున్నాయి. దేశాభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించేలా యువతకు దిశానిర్దేశం చేయడానికి బదులు.. రాజకీయ ఘర్షణలను రెచ్చగొట్టేందుకు వారిని ఉపయోగించుకుంటున్నాయి. పాలన మార్పు కోసం బంగ్లాదేశ్ నుంచి స్ఫూర్తి పొందామని వారు బహిరంగ సమావేశాల్లోనే చెబుతున్నారు. ప్రభుత్వాన్ని పడగొడుతామని అంటున్నారు. వారి పోరాటం ఎన్నికల వ్యవస్థ, సర్ ప్రక్రియకు సంబంధించిన సమస్యలపై కాదు..! ప్రజాస్వామ్య సంస్థలను కూల్చివేసి, దేశాన్ని తగలబెట్టడమే వారి ఏకైక అజెండా అని స్పష్టమవుతోంది” అని రాజ్‌నాథ్ విమర్శించారు. విపక్షాల రంగు బయటపడుతోంది... అధికారం కోసమే నిరసనలు: భాజపా ఈ సందర్భంగా విపక్షాల ర్యాలీని తప్పుబడుతూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను రక్షణమంత్రి సమర్థించారు. “శాంతిభద్రతలను కాపాడటానికి చట్టాన్ని గౌరవించడం అత్యవసరం. రాజకీయ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య సంస్థలను బలిచేయకూడదు. ఇలాంటి అసత్య ఆరోపణలతో, అవకాశవాద రాజకీయాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించలేం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇకనైనా ప్రజా తీర్పును గౌరవించి.. రాజకీయాల్లో తన పాత్రపై ఆత్మపరిశీలన చేసుకోవాలి.

# తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి..
# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకం



**సంగారెడ్డి, అక్టోబర్ 17(సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజలు, రైతుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. శుక్రవారం గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి, కంది, టమాట పంటలను పరిశీలించారు. పత్తి రైతు బాల్‌రెడ్డితో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. వీబీ-జీ రామ్‌జీ పథకం కింద పనిదినాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట పంట విరామం పాటించేలా ప్రోత్సహించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రస్తుత పంటల పరిస్థితి, వర్షపాతం, తాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం లభ్యత, భవిష్యత్తులో తలెత్తే సమస్యలను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రైతులు ఆరుతడి పంటలు ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలని వాణి ప్రసాద్ సూచించారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా వరి సాగు చేసి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పంటల పరిస్థితిని పరిశీలించి, రైతులకు తగిన సూచనలు అందించాలని, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థాయి, బోర్లలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. గ్రామాలవారీగా తాగునీటి అవసరాలు, నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని, వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టి పొదుపుగా వినియోగించుకునేలా వాటర్ రిసోర్సెస్ కమిటీలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామస్థాయిలో నీటి సంరక్షణకు సంబంధించిన తీర్మానాలు చేయించాలని సూచించారు. రాబోయే 10--15 రోజులు పంటల రక్షణకు కీలకమని పేర్కొంటూ, అవసరమైన ప్రాంతాల్లో పంటలకు తగిన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని, సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతి వారం సంయుక్త సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా పశుగ్రాసాన్ని నిల్వ చేసుకునేలా అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు సంగీత, లక్ష్మి కిరణ్‌తో పాటు వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, గుమ్మడిదల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షలకు పైగా విలువైన 105 మొబైల్ ఫోన్లు రికవరీ..
# బాధితులకు అందజేసిన ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్





**సూర్యాపేట, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):**
ప్రజలు పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తిరిగి అందజేయడంలో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ విశేష కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. ఇందులో భాగంగా జజు×= పోర్టల్ ద్వారా రికవరీ చేసిన రూ.20 లక్షలకు పైగా విలువైన 105 మొబైల్ ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ విధంగా 100కు పైగా మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేయడం ఇది 15వ సారి అని వెల్లడించారు. సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చేరుకున్న మొబైల్ ఫోన్లను సైతం సైబర్ వారియర్స్ సాంకేతిక విశ్లేషణతో గుర్తించి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగంగా మారాయని, కమ్యూనికేషన్‌తో పాటు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం, కుటుంబ సభ్యుల ఫొటోలు, ముఖ్యమైన పత్రాల భద్రతకు వాటిని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు దాని విలువతో పాటు అందులోని విలువైన సమాచారం, జ్ఞాపకాలను కోల్పోయిన బాధ బాధితులకు ఉంటుందని, అలాంటి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి ఫోన్లను రికవరీ చేసి అసలు యజమానులకు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి రక్షణ, నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళలు, బాలల రక్షణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవాలని, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపుతూ ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, అత్యాశకు పోయి గుర్తుతెలియని వ్యక్తుల సూచనలతో పెట్టుబడులు పెట్టవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద ఏపీకే (ఞూఖ) ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లను ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించకూడదని, తమ అజాగ్రత్త కుటుంబ సభ్యుల జీవితాలపై కూడా ప్రభావం చూపుతుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారిపై వేధింపులు, లైంగిక దాడులు, అత్యాచారాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై వేధింపులు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగినప్పుడు బాధితులు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పిలుపునిచ్చారు. ప్రజల భద్రత, సైబర్ నేరాల నివారణ, మొబైల్ ఫోన్ల రికవరీ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, బాలల రక్షణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

# శ్రీ మహా సరస్వతి దేవిగా నల్ల పోచమ్మ తల్లి దర్శనం.. పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు



**మనూర్ , అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి అమ్మవారు శ్రీ మహా సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జూకంటి అనిల్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి దర్శనంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఆందోల్ సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్**
**అక్టోబర్ 17-10-2026**
జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్.ఎం.ఓ అశోక్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లేడీ డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆసుపత్రి ప్రాంగణంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ వేడుకలతో ఆసుపత్రి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

# భూ తగాదాల పరిష్కారానికే భూ రీసర్వే

**- ప్రజలు గ్రామసభలకు హాజరై రీసర్వేకు సహకరించాలి: జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**




**మెదక్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డులను ప్రక్షాళన చేసి, భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం భూ రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్ మండలం తుల్జారంపేట, రామచంద్రాపూర్ గ్రామాల్లో నిర్వహించిన భూ రీసర్వే గ్రామసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి, భూ వివాదాల పరిష్కారానికి రీసర్వే కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లోని తప్పులను గుర్తించడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేస్తూ, గ్రామసభలకు పెద్ద ఎత్తున హాజరై భూ రీసర్వే కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోసానిపెట గ్రామం లో ఘనంగా అట్ల బతుకమ్మ వేడుకలు



**అందోల్ -పోసానిపెట , అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం):**
పోశంపేట గ్రామంలో అక్టోబర్ 16న అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు, చిన్నారులు, వృద్ధులు కలిసి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి హనుమాన్ టెంపుల్ మందిరం వద్దకు తీసుకువచ్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. గ్రామంలోని చిన్నపిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్థులంతా కలిసికట్టుగా వేడుకలకు సహకరించి, అట్ల బతుకమ్మ సంబరాలను విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు.

# బహిరన్ దిబ్బలో ఘనంగా అట్ల బతుకమ్మ సంబరాలు

**మెదక్ / అల్లాదుర్గం, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ మెదక్ జిలా):**





మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామంలో అట్ల బతుకమ్మ పండుగ సంబరాలు శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ జానపద గీతాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు ఒకరికొకరు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ గ్రామంలో ఐక్యతను చాటింది. ఈ వేడుకలతో బహిరన్ దిబ్బ గ్రామం పండుగ శోభను సంతరించుకుంది.

# ఘనంగా PP9 ఛానెల్ 5వ వార్షికోత్సవ వేడుకలు



**నారాయణఖేడ్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల గొంతుకగా ముందుకు సాగుతున్న ూా9 యూట్యూబ్ న్యూస్ ఛానెల్ ఐదవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నారాయణఖేడ్‌లోని కార్తికేయ రెస్టారెంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యావేత్త కృష్ణ కుమార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2021 అక్టోబర్ 16న "ఆలోచన ఆచరణలో పెడదాం" అనే నినాదంతో ప్రారంభమైనూా9 ఛానెల్ ఐదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకల్లో ఛానెల్ మేనేజింగ్ డైరెక్టర్ పొట్టి ప్రవీణ్ కుమార్‌ను ముఖ్య అతిథులు అభినందించారు. ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఛానెల్ ఐదేళ్లలో మంచి స్థాయికి చేరుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఆలోచనలను ఆచరణలో పెట్టినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని అన్నారు. ూా9 ఛానెల్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఐదేళ్ల ప్రయాణంలో ఛానెల్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్యకరమైన తల్లి--బిడ్డలతో ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

**- అంగన్‌వాడీల ద్వారా పోషకాహార స్థాయుల మెరుగుదల -- కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఆరోగ్యకరమైన తల్లి--బిడ్డలతో ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం, పోషణ, సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహార సేవలను నిరంతరం అందించాలని అధికారులకు సూచించారు. మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం--2026 ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు వారి వయస్సు, శారీరక అవసరాలకు అనుగుణంగా సమతుల ఆహారం అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోషకాహారంపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 9వ జాతీయ పోషణ మాసంలో భాగంగా నెల రోజుల పాటు పోషకాహారం ప్రాముఖ్యత, పోషణ్ ట్రాకర్, జన ఆందోళన్, సమతుల ఆహారం తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులు, కిషోర బాలికలు, చిన్నారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేట్ ప్రీ-స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేస్తూ చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదల, పోషకాహార స్థాయులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పోషకాహార లోపాన్ని నివారించేందుకు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు.

# మార్నింగ్ వాక్ సురక్షిత ప్రాంతాల్లోనే చేయాలి..

# రహదారులపై నడిస్తే ప్రమాదం: ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్



సూర్యాపేట, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):
సూర్యాపేట జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనగామ హైవేపై బాలెంల గ్రామ స్టేజి వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును, ఘటనకు గల కారణాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన నాగరాజు, సైదులు, జానయ్య అనే ముగ్గురు వ్యక్తులు తెల్లవారుజామున రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు, సైదులు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన జానయ్యను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీసీఎం డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, స్థానిక ఎస్ఐ అనిల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ రహదారులు, రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై మార్నింగ్ వాక్ చేయకుండా మైదానాలు, పార్కులు, సురక్షితమైన వెంచర్ల వంటి ప్రదేశాలను ఎంచుకోవాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా వాహనాల రాకపోకలను గమనించి జాగ్రత్తగా దాటాలని, రహదారుల పక్కన ఉన్న గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తెల్లవారుజామున పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రమాద సూచిక బోర్డులు, బ్లాక్ స్పాట్లు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం మానుకోవాలని స్పష్టం చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని, పొగమంచు, తక్కువ వెలుతురు ఉన్నప్పుడు వేగాన్ని తగ్గించి తగినంత దూరం పాటించాలని, అలసటగా ఉన్నప్పుడు లేదా నిద్రమత్తులో ఉన్నప్పుడు వాహనాలు నడపకూడదని తెలిపారు. వాహన సామర్థ్యానికి మించి లోడుతో ప్రయాణించవద్దని, ఇతర వాహనదారుల తప్పిదాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'ూా==×ఎజు ూూా×ఎజు' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. రోడ్డు నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. తొందరపాటు కంటే ప్రాణం ముఖ్యమని, కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# జోగిపేటలో బీజేపీ ప్రెస్‌మీట్..SIR పై

# ప్రతిపక్షాలది తప్పుడు ప్రచారం: జగదీశ్వర్ పటేల్



**అందోల్-జోగిపేట, అక్టోబర్ 17 (సందేశంటైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్ )**
ఓటర్ల జాబితాలో పారదర్శకత తీసుకురావడమే SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రధాన ఉద్దేశమని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఆందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ పటేల్ అన్నారు. SIR ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. శనివారం జోగిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ పటేల్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఉన్న నకిలీ, డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడంతో పాటు, మరణించిన వారి పేర్లను సరిచేసి, అర్హులైన కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించేందుకు ూా×= ప్రక్రియ దోహదపడుతుందని తెలిపారు. ఇది ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టే ప్రక్రియ అని, దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలోనూ ఈ తరహా సవరణలు జరిగాయని, ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని వివరించారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, అడ్వకేట్ చంటిబాబు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకోవడానికి ూా×= అవకాశం కల్పిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు తన ఓటు హక్కు ఉండేలా జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉండటం ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలకు ఎంతో ముఖ్యమని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని కోరారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.దఈ ప్రెస్‌మీట్‌లో మాజీ కౌన్సిలర్ గోపి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటిబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి భూమయ్య, ప్రభాత్ రమేష్, నబీము, సురేష్, మాజీ కౌన్సిలర్ శివశంకర్, అనిల్, అశోక్, ఆందోల్ మండల బీజేపీ అధ్యక్షురాలు పావని, కో-కన్వీనర్ సుమన్, జోగిపేట టౌన్ సెక్రటరీ పాపయ్య, రమేష్, పోసానిపేట్ వార్డు సభ్యుడు వి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**- పూలను దైవాలుగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ: కలెక్టర్ ప్రతిమా సింగ్**

**- బతుకమ్మల అలంకరణలో డీఆర్డీఓ శాఖకు ప్రథమ స్థానం.. జిల్లా సంక్షేమ శాఖకు ద్వితీయ స్థానం**



**మెదక్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం అంబరాన్నంటాయి. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు కలెక్టరేట్ ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ గౌరీమాతకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ గేయాలు ఆలపిస్తూ లయబద్ధంగా ఆడిపాడారు. ప్రకృతిని ఆరాధించే ఈ పూల పండుగలో భాగంగా వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, ఐకేపీ, మెప్మా మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తీరొక్క రంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి తీసుకొచ్చారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణాన్ని సందడిగా మార్చారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో బతుకమ్మల అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మహిళలను శక్తి స్వరూపిణులుగా గౌరవించే గొప్ప సంస్కృతి తెలంగాణకు సొంతమని అన్నారు. పూలను దైవాలుగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. భావితరాలకు బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని తెలియజేస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు. వేడుకల్లో భాగంగా బతుకమ్మలను అందంగా అలంకరించిన శాఖలకు బహుమతులు అందజేశారు. బతుకమ్మల అలంకరణలో డీఆర్డీఓ శాఖ ప్రథమ స్థానాన్ని, జిల్లా సంక్షేమ శాఖ ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు అధికారులు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా పండుగ శోభతో కళకళలాడింది.

# వ్యవసాయానికి 6 గంటల కరెంట్ ఇవ్వాలి..
# రైతులకు రూ.లక్ష పంట నష్టపరిహారం అందించాలి

**- న్యాయం చేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ దించడం ఖాయం: దండే అపర్ణ**

**నర్సాపూర్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
వ్యవసాయానికి కనీసం ఆరు గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున పంట నష్టపరిహారం అందించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దండే అపర్ణ డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ దించడం ఖాయమని ఆమె హెచ్చరించారు. శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని నాగులపల్లి, జక్కపల్లి, చిప్పల్తుర్తి, మూసాపేట గ్రామాల్లో ఆమె పర్యటించి విద్యుత్ కోతల కారణంగా ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. నాగులపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల పంటలు ఎండిపోతూ తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆమెకు వివరించారు. దీంతో రైతుల వద్దకు వెళ్లిన దండే అపర్ణ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి కనీసం ఆరు గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయని, దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన



జీవనాధారమని, పంటలు నష్టపోతే రైతు కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. విద్యుత్ కోతలతో పంటలు నష్టపోయిన రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే రైతుల తరఫున పోరాటం కొనసాగిస్తామని దండే అపర్ణ హెచ్చరించారు.

# ఫుడ్ పాయిజనింగ్‌కు కారణమైన రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలి..
# జిల్లావ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించాలి

**మెదక్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
నర్సాపూర్ పట్టణంలోని వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, మెదక్ జిల్లావ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లలో నిరంతర తనిఖీలు నిర్వహించాలని సీపీఎం మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ మాట్లాడుతూ నర్సాపూర్‌లోని వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో ఆహారం తిని 36 మంది అస్వస్థతకు గురికావడం, సాయి అనే యువకుడు మృతిచెందిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కొత్తగా



ప్రారంభమవుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు ప్రభుత్వ అనుమతులు తీసుకుంటున్నాయా లేదా అనే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలు ఆకలి తీర్చుకోవడానికి హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్తుంటే అక్కడి ఆహారం తిని అనారోగ్యానికి గురికావడం, ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల తయారీలో అధిక మోతాదులో మసాలాలు, కారం, రసాయనాలు వినియోగించడం, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారని ఆరోపించారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు లాభాల కోసం ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టకూడదని, ఆహార పదార్థాల తయారీ గదులు, వంట సామగ్రి, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ కోరింది.

# రాంసాన్‌పల్లిలో సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన నవదుర్గాదేవి

**-శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజు ప్రత్యేక పూజలు**

**అందోల్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు దుర్గాభవాని అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దివ్యదర్శనం చేసుకుంటూ 'ఓం శ్రీ మాత్రే నమః' మంత్రాన్ని జపించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉపసర్పంచ్ పృథ్వీరాజ్, పట్లోళ్ల మాజీ సర్పంచ్ సువర్ణ దామోదర్ రెడ్డి, కోరుబోయిని మాజీ సర్పంచ్ లక్ష్మి ఆగమయ్య, జోగిరెడ్డి, జోగేందర్, మల్లేశ్ గౌడ్, శంకర్, మొగులయ్య, లక్ష్మణ్, శివకుమార్, శ్రీనివాస్,



గోపాల్, శంకు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పట్లోళ్ల శివరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# నాగులవంచలో ఆధ్యాత్మిక శోభ.. అంగరంగ వైభవంగా హోమగుండం పడిపూజ



**చింతకాని, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని దొరవారి గడి సెంటర్‌లో హోమగుండం పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడి సెంటర్‌ను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు భవాని స్వాముల సందడితో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భవాని స్వాములు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తిప్రపత్తులను చాటుకున్నారు. విద్యుత్ దీపాల వెలుగులు, పూజా కార్యక్రమాలతో దొరవారి గడి సెంటర్ ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# గౌడ హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

**గౌడ విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధే లక్ష్యం**



**అందోల్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ప్రతినిధి మల్లేశం గౌడ్):**
గౌడ విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో నిర్మించిన గౌడ హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరై నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. గౌడ హాస్టల్ చైర్మన్ మోతి చక్రవర్తి గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. గౌడ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, వారి విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం ఈ భవనం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# డి ఇ ని సన్మానించిన తెలంగాణ ఎస్సీ అండ్ ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ



**జోగిపేట, అక్టోబర్ 17 సందేశం టైమ్స్**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి డివిజన్ ఇంజనీర్ సంఘం వెంకటేశ్వర్లు రెండేళ్ల బాధ్యతలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ఎస్సీ అండ్ ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 202 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎం.ఆర్. రవీందర్ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల రాజేశ్వర్, కలిసి ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, యాదయ్య, మహేష్, మల్లేష్, బాగ్య,తదితరులు పాల్గొన్నారు.

## పోసానిపేటలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**అందోల్ -పోసానిపేట, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్):**



పోసానిపేట గ్రామంలోని హనుమాన్ టెంపుల్ ఎదుట దుర్గాభవాని యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యూత్ కమిటీ సభ్యులు సమష్టిగా ముందుకు వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పిల్లుట్ల, అల్లిపూర్‌లో సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బుచ్చేష్ యాదవ్, నిరంజన్ దాసు**

**మెదక్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా శివంపేట మండలంలోని పిల్లుట్ల, అల్లిపూర్ గ్రామాల్లో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్, మెదక్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వనముల బుచ్చేష్ యాదవ్, 11వ వార్డు కౌన్సిలర్ నిరంజన్ దాసు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దపల్లి రవి, పిల్లుట్ల గ్రామ సర్పంచ్ మురళి గౌడ్, అల్లిపూర్ గ్రామ సర్పంచ్ కుమార్, సాదు చిన్న, సాదు ప్రసాద్, నర్రా ప్రశాంత్, మల్లేష్, దొంతి వెంకటేష్, గండి విజయ్, సంద వేణుగోపాల్, సాదు విజయ్, బన్నీ, బ్యాకిని శ్రీనివాస్, ఉపసర్పంచ్ చిన్న కృష్ణ, నిమల మల్లేష్, వార్డు సభ్యులు ఆంజనేయులు, కమ్మరి శివశంకర్, పెద్దపులి సతీష్, దినేష్ రెడ్డి, శ్రీధర్ గౌడ్‌తో పాటు భవానీ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.





## పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో మానూర్ మండలానికి ఐదుగురికి చోటు

**నూతన రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి భట్టపురం మధుసూదన్ రెడ్డికి అభినందనలు**



**నారాయణఖేడ్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
నల్గొండలో అక్టోబర్ 16న నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో 2026--28 సంవత్సరానికి రాష్ట్ర అధ్యక్షుడిగా సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా భట్టపురం మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు మానూర్ మండల పీఆర్‌టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర కార్యవర్గంలో మానూర్ మండలం నుంచి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికైన ఎం. మహేశ్ కుమార్, కె. ప్రసన్న కుమార్, బండి శ్రీనివాస్, వి. మేఘ్య నాయక్, ఎస్. మధుసూదన్ రెడ్డిలను అభినందించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మానూర్ మండల అధ్యక్షుడు బర్మావత్ సర్దార్, ప్రధాన కార్యదర్శి ఎర్ర సంగారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నూతన నాయకత్వంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని వారు కోరారు

# నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజలు

**- సదాశివపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు.. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే..**





**అక్టోబర్ 17(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**
దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. సదాశివపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిజాంపురం కుటుంబ సభ్యులు అశోక్, రవి, నాగరాజు ఆధ్వర్యంలో,జైభవాని యూత్ మాజీ కౌన్సిలర్ ఆకుల శివ, దిద్దిగే నగేష్, కటకం కిరణ్, మల్లికార్జున, వంశీ, సాయిరాజు సేటు, ధనుంజయ్ గౌడ్, రచ్చన్న స్వామి, సారపు అభి, చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, శ్రీధర్ రెడ్డి, చింత సాయినాథ్, చీల మల్లన్న, నగేష్, కౌన్సిలర్ వైశాలి నాగరాజు గౌడ్, దిద్దిగే వినోద్, కొత్రికే సాయిరాజ్, తంగెడ్పల్లి లక్ష్మణ్, కంది మల్లేశం, పెద్ద గౌడ్, మల్లికార్జున శంకర్, కొత్త రామన్న, కోదూరు అంజయ్య తదితర స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు

**- టి.ఎన్.జి.ఓ. యూనియన్, వివిధ శాఖల ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం**





**సంగారెడ్డి, అక్టోబర్ 17(సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలు సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టి.ఎన్.జి.ఓ.) యూనియన్, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య అదనపు కలెక్టర్ సంగీత గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఒకచోట చేరి పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ లలితాదేవి, టి.జి.ఓ. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, జిల్లా టి.ఎన్.జి.ఓ. అధ్యక్షుడు, మహిళా నాయకులు, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, కలెక్టరేట్ సమీప కాలనీల మహిళలు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**పోలీసు కుటుంబాల ఆటపాటలతో పండుగ**



**మెదక్, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి జానపద పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. వారి ఆటపాటలతో జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ వేడుకలను నిర్వహించారు. విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పడంతో పాటు పోలీసు కుటుంబాల్లో ఆనందాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు సందీప్ రెడ్డి, జార్జ్, కృష్ణమూర్తి, శైలేందర్, రామకృష్ణ, మహిళా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చింతకాని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులకు ఘన సన్మానం

**- ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన నాయకత్వం కృషి చేయాలి**

**చింతకాని, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఖమ్మం జిల్లా చింతకాని మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన మనం న్యూస్ రిపోర్టర్ జొన్నలగడ్డ మల్లేశ్వరి, కార్యదర్శిగా ఎన్నికైన సీకే న్యూస్ ప్రతినిధి గుడిది పిచ్చయ్యలను తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబుతో పాటు పలువురు చింతకాని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ నాయకత్వం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. జర్నలిజం విలువలను కాపాడుతూ, నిష్పాక్షికంగా వార్తలను ప్రజలకు అందించి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ చింతకాని మండల నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, న్యాయవాది నారపోగు నాగయ్య, మండల నాయకులు ఐతం ఆదినారాయణ, సీనియర్ మండల నాయకులు దర్శ బాలకృష్ణ, ఐతం వెంకటేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న సంగారెడ్డి కింది బజార్ చెరువు కట్ట.

- ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి,తోపాజి..

**అక్టోబర్ 17(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**
సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ పరిశీలించారు. కట్ట పొడవునా చేపడుతున్న విద్యుద్దీపాలంకరణ, కట్ట అంచుల్లో బారికేడ్ల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసారి బతుకమ్మల నిమజ్జనం



కోసం రెండు ఘాట్లను సిద్ధం చేస్తున్నామని, మెట్లకు రంగులు వేస్తున్నామని నిర్వాహకులు వివరించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన అవశేషాలను పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.దవేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా 32 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దీని తయారీకి 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఐదు డీజే పాయింట్లు, ఘాట్ల వద్ద ఐదు లైటింగ్ టవర్లతో సహా మొత్తం 18 లైటింగ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే 32 అడుగుల స్క్రీన్, లేజర్ లైటింగ్‌తో పాటు చెరువు కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు బొంగుల రవి కూన సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# గౌడ విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి: రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ

- గౌడ హాస్టల్ నిర్మాణానికి అర ఎకరం భూమి ఉచితంగా దానం చేసిన లక్ష్మీనారాయణ గౌడ్‌కు అభినందనలు

**పటాన్‌చెరు, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ప్రతినిధి మల్లేశం గౌడ్):**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో నూతన గౌడ హాస్టల్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్మాణం కోసం అర ఎకరం భూమిని ఉచితంగా దానం చేసిన లక్ష్మీనారాయణ గౌడ్‌ను తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ, జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ పేద గౌడ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం హాస్టల్ నిర్మాణానికి భూమి దానం చేసిన లక్ష్మీనారాయణ గౌడ్‌తో పాటు భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సోదరులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. నిరుపేద గౌడ విద్యార్థులకు ఇలాంటి హాస్టల్ భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార




కార్యదర్శి వెంకటేశం గౌడ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, రవీందర్ గౌడ్, యాద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాభవాని అమ్మవారి సేవకు రూ.9 లక్షల విరాళం.. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు

**జోగిపేట, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్):**
జోగిపేటలో దుర్గాభవాని అమ్మవారి పూజా కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ మాజీ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ ఆదేశాల మేరకు అమ్మవారి సేవా కమిటీకి రూ. 9 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరణ చేయడంతో పాటు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. అమ్మవారి సేవకు అందించిన విరాళాలను పూజా కార్యక్రమాలకు, అమ్మవారి అలంకరణకు వినియోగించాలని కమిటీ సభ్యులకు సూచించారు. భక్తులకు



అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మిక సేవలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఆందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ పటేల్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అడ్వకేట్ చంటిబాబు, మాజీ కౌన్సిలర్ గోపి, బీజేపీ జిల్లా కార్యదర్శి



భూమయ్య, ప్రభాత్ రమేష్, నబీము, సురేష్, మాజీ కౌన్సిలర్ శివశంకర్, అనిల్, అశోక్, ఆందోల్ మండల బీజేపీ అధ్యక్షురాలు పావని, కో-కన్వీనర్ సుమన్, జోగిపేట టౌన్ సెక్రటరీ పాపయ్య, రమేష్, పోసానిపేట్ వార్డు సభ్యుడు వి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# చక్రిపురం రెడ్డి కాలనీలో దుర్గామాత హోమం



**అక్టోబర్ 17 సందేశం టైమ్స్**
చక్రిపురం రెడ్డి కాలనీలో దుర్గామాత హోమాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పండాల శివకుమార్ గౌడ్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పండాలశివకుమార్ గౌడ్ మాట్లాడుతూ, దుర్గామాత కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాజరైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, చెర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, పిన్ రెడ్డి ప్రసాద్ రెడ్డి, జూపల్లి శ్రీశైలం, చందా రఘు, కోడారి సందీప్, శ్రీకాంత్,కార్యకర్తలు, స్థానికులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.

# కుషాయిగూడ అమ్మవారి మండపాలలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రత్యేక పూజలు



**అక్టోబర్ 17 సందేశం టైమ్స్**
కుషాయిగూడ డివిజన్ పరిధిలోని స్మాషర్స్ బాక్స్ క్రికెట్, జమ్మిగడ్డ లోని నెహ్రూ నగర్ వజ్రా యూత్ అసోసియేషన్, వాసవి శివ నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి మండపాలలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.దఅనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ, అలాగే ఆహ్వానించిన నిర్వాహకులకు బొంతు శ్రీదేవి యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రేపల్లెవాడలో భూముల రీ సర్వే కార్యక్రమం ప్రారంభం

- భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే కీలకం.. భూముల వివరాల నమోదు పారదర్శకంగా చేపట్టాలి



**చింతకాని, అక్టోబర్ 17 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామంలోని కంట మహేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పరిధిలోని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ రికార్డుల నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టనున్నారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ సర్పంచ్ మడుపల్లి అంబికా రాంప్రసాద్, తహసీల్దార్ కరుణశ్రీ, సర్వేయర్ నవీన్, జీపీఓ కిరణ్, గ్రామ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ నాయకులు మడుపల్లి భాస్కర్, బంధం కృష్ణ, మడుపల్లి కిరణ్ బాబు, బండి శ్రీనివాసరావు, మడుపల్లి వెంకటేశ్వర్లు, నాగబండి వెంకటనారాయణ, ఎటుకూరి మోహన్ రావు, సామినేని శ్రీనివాసరావు, కట్టా తుత్తురు, మడుపల్లి రమేష్, లక్ష్మీపతి, రాంబాబు, కొమ్మనే ప్రసాద, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి మండపాలను సందర్శించిన మాద్రి పృథ్వీరాజ్



**అక్టోబర్ 17(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**
దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని శ్రీరామ్ నగర్, శివాలయంతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వీణ= ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాద్రి పృథ్వీరాజ్ ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# బోరంచలో ఘనంగా శ్రీ నల్లపోచమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్



**నారాయణఖేడ్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామంలో శ్రీ నల్లపోచమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్ (బోరంచ ప్రీమియర్ లీగ్)ను నిర్వాహకుడు జి. నగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పండుగల సందర్భంగా ప్రతి సంవత్సరం ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల గ్రామ యువత ఒకచోట చేరి ఉత్సాహంగా గడుపుతున్నారని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో స్నేహభావం, ఐక్యత, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. పండుగల సమయంలో గ్రామస్తులు, యువత కలిసి సంతోషంగా గడపడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార ఆగదు
Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
17-10-2026

# జాతీయ స్థాయి కబడ్డీలో కామారెడ్డి బాలికల జట్టు సత్తా..

- గోల్డ్ మెడల్‌తో ఘన విజయం
- విజేతలకు కామారెడ్డిలో ఘన స్వాగతం పట్టణంలో భారీ ర్యాలీ

అక్టోబర్ 17 సందేశం టైమ్స్
జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి కామారెడ్డి ఖ్యాతిని జాతీయ స్థాయికి చాటిన శ్రీ సరస్వతీ శిశుమందిర్ హైస్కూల్ అండర్-14 బాలికల కబడ్డీ జట్టుకు కామారెడ్డిలో ఘన స్వాగతం లభించింది. మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో విద్యాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేల్ కూద్ పోటీల్లో పాల్గొన్న ఈ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో ఉత్తర క్షేత్రం జమ్మూ కాశ్మీర్ జట్టుపై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. విజయం సాధించి స్వస్థలానికి చేరుకున్న క్రీడాకారిణులను పాఠశాల యాజమాన్యం, క్రీడాభిమానులు, పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కామారెడ్డిలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, క్రీడాభిమానులు విద్యార్థినులకు అభినందనలు తెలియజేస్తూ ఉత్సాహపరిచారు. జాతీయ స్థాయిలో విజయం సాధించి పట్టణానికి గర్వకారణంగా నిలిచిన బాలికలపై ప్రశంసల వర్షం కురిపించారు.కామారెడ్డికి గర్వకారణం ఈ సందర్భంగా డాక్టర్ శ్యాంసుందర్ రావు మాట్లాడుతూ, కామారెడ్డి చరిత్రలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించి విద్యార్థినులు సరికొత్త చరిత్రను లిఖించారని అన్నారు. ఈ విజయం కామారెడ్డి పట్టణానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి కూడా ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థినులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.కామారెడ్డి టౌన్ ఎస్ఐ సాయి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో సంతోషకరమని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన బాలికలు భవిష్యత్తులోనూ ఇదే విధంగా విజయాలు సాధిస్తూ ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు.హర్యానాలో తదుపరి పోటీలు ఈ జట్టు సాధించిన విజయంపై విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తమ పిల్లలు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో హర్యానాలో నిర్వహించనున్న పోటీల్లో ఎస్‌జీఎఫ్ఐ తరఫున ఈ జట్టు పాల్గొననుందని పాఠశాల ప్రధానాచార్యులు నాగభూషణం, అకాడమిక్ ప్రిన్సిపల్ నాగేష్ తెలిపారు. రాబోయే పోటీల్లోనూ బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు






సాధించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గీరెడ్డి రాజారెడ్డి, బొడ్డు శంకర్, గోపాలకృష్ణమూర్తి, సామల గంగారెడ్డి, రణజిత్ మోహన్, ప్రతాప్ గౌడ్, రాజేందర్ గౌడ్, ముప్పారపు ఆనంద్, సంతోష్, పబ్బ శ్రీనివాస్, ధనుంజయ, డీవైఎస్ఓ రంగా వెంకటేశ్వర్ గౌడ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాణాల భాస్కర్ రెడ్డి, పేట అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజు, ఎస్ఐ గరుగంటి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్, శిశుమందిర్ ప్రబంధకారిణి సభ్యులు, ఆచార్యులు, మాతాజీలు తదితరులు పాల్గొన్నారు.జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన బాలికల జట్టుకు లభించిన ఘన స్వాగతం కామారెడ్డి పట్టణంలో క్రీడా స్ఫూర్తిని నింపింది. విద్యార్థినుల విజయం ఇతర విద్యార్థులకు కూడా ఆదర్శంగా నిలిచింది.
2

# కరెంటు కోతలతో రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఫైర్..

-వ్యవసాయానికి 18 గంటల కరెంట్ ఇవ్వాలి: బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

అక్టోబర్ 17 సందేశం టైమ్స్
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దోమకొండ మండల బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. శు



క్రవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ కోడిప్యాక తిరుపతి గౌడ్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు బోరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందక పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉండేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి రోజుకు 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ సమావేశంలో జనగామ నరేష్, గజవాడ శ్రీకాంత్, ఎం.డి. సలీం, అరుట్ల అనిల్, వెన్నెల సిద్ధరాములు, కానుగంటి నాగరాజు, మన్నె సాయిరెడ్డి, ముదాం గంగయ్య, బోరెడ్డి నాగరాజు రెడ్డి, చిట్యాల రాజిరెడ్డి, బుర్రి రవి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# జనాభా గణన-2027 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

-జనాభా గణనను పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అక్టోబర్ 17 సందేశం టైమ్స్
జనాభా గణన-2027ను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జనాభా గణన ఒక కీలకమైన జాతీయ కార్యక్రమమని, ఇందులో సేకరించే ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.కామారెడ్డి జిల్లాలో జనాభా గణన-2027 రెండో దశకు సంబంధించి సెన్సెస్ ఛార్జ్ క్లర్క్‌లు, సాంకేతిక సహాయకులకు శుక్రవారం రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని 25 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు చెందిన సిబ్బంది పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, శిక్షణా తరగతులను సిబ్బంది సద్వినియోగం చేసుకొని జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో నిర్దేశిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సమాచార సేకరణలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.40 రకాల ప్రశ్నలపై అవగాహన శిక్షణలో భాగంగా జనాభా గణనకు సంబంధించిన 40 రకాల ప్రశ్నలు, వాటి ద్వారా సమాచారాన్ని సేకరించే విధానం, స్వీయ గణన ప్రక్రియ, సి.ఎం.ఎం.ఎస్. పోర్టల్‌లో చేపట్టాల్సిన సాంకేతిక ప్రక్రియలపై మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని నమోదు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, సాంకేతిక అంశాలను వివరించారు.జనాభా గణన



ప్రక్రియలో సిబ్బందికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతోపాటు, విధుల నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్, జిల్లా గణాంకాల అధికారి కార్యాలయానికి చెందిన మాస్టర్ ట్రైనర్లు భుక్య రవికుమార్, ఏ.ఆర్. యుగంధర్ బాబు, సెన్సెస్ ఛార్జ్ క్లర్క్‌లు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద వాల్గోట్ హైస్కూల్‌లో మంచినీటి బోరు ఏర్పాటు..

-విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

అక్టోబర్ 17 సందేశం టైమ్స్
పెద్ద వాల్గోట్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థుల నీటి అవసరాలను తీర్చేందుకు బోరు ఏర్పాటు చేశారు. పాఠశాలలో నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకరించిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి గ్రామ ప్రజల తరఫున స్థానిక నాయకులు



కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ఎంతో ముఖ్యమని, నీటి వసతి అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. పాఠశాల అవసరాలను గుర్తించి బోరు ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, ఉప సర్పంచ్ తలకట్ల రాములు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జాగిరపు సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, వీడీసీ చైర్మన్ తలకట్ల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతికూల వాతావరణ పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

- సింగూరు తాగునీటి అత్యవసర ప్రణాళికకు రూ.22.59 కోట్లు మంజూరు

అక్టోబర్ 17 సందేశం టైమ్స్
ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటల పరిరక్షణ, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో రానున్న 60 రోజుల పాటు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టం ఆధారంగా జుక్కల్, పెద్ద కొడప్‌గల్, సదాశివనగర్, మహమ్మద్‌నగర్ మండలాలను మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి, పత్తి పంటలు కొంతమేర ఎండిపోయాయని, మిగిలిన పంటల కోతలు పూర్తయ్యే వరకు సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, లో-వోల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టుల నుంచి చివరి తడులకు అవసరమైన నీటిని జాగ్రత్తగా విడుదల చేయాలని సూచించారు.సింగూరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గడంతో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రూ.84.14 కోట్ల అత్యవసర తాగునీటి ప్రణాళికలో కామారెడ్డి జిల్లాకు రూ.22.59 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అత్యవసర బోరుబావుల తవ్వకం, మోటార్ల మార్పిడి, పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.భూగర్భ జలాల పరిస్థితిని ప్రతి వారం పర్యవేక్షించాలని, మిషన్ భగీరథ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.
13

# శివరామ మందిరంలో ప్రత్యేక కుంకుమార్చన పూజ..

-నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు

అక్టోబర్ 17 సందేశం టైమ్స్
కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలోని శివరామ మందిరంలో శుక్రవారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చన పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి



ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన ద్వారా అమ్మవారిని భక్తులు ఆరాధించారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.